మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంతోష్...

పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

గద్వాల ప్రతినిధి,మార్చి21,ప్రభాతవార్త: స్థానిక అభ్యాసన ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రతి రూమ్ కు వెళ్లి ఆయన పరిశీలించారు. మాస్ కాపీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలు, నిరంతరం విద్యుత్ సరఫరాలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాత లోనికి పంపాలని, సెల్‌ఫోన్ ను అనుమతించవద్దని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 7212 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, గురువారం 7181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారని, 31 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ శ్రీనివాసులు కలెక్టర్‌కు ఈ సందర్భంగా తెలియజేశారు. చీఫ్ ఎగ్జామినర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో అధికారులు..
ఇబ్బందుల్లో ప్రజలు..
పట్టించుకుని ఉన్నతాధికారులు

గద్వాల ప్రతినిధి మార్చి 21 ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐలు లేక పనులన్ని నిలిచిపోయాయి. ముఖ్యంగా ఫ్యామిటీ మెంబర్, క్యాస్ట్, ఇన్కమ్, షాదిముబారక్, కళ్యాణలక్ష్మి, అప్లికేషన్స్ ఆగిపోయాయి. తహసిల్దార్ కార్యాలయానికి ప్రతి వివిధ పనుల నిమిత్తం వందలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థిని విద్యార్థులు వస్తుంటారు. గద్వాల పట్టణం, రూరల్ మండలం కలుపుకోని సుమారు రెండు లక్షల జనాభా ఉన్నా ఒకటే మండలం ఉండటంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు అనేక సమస్యలు ఎదురుకొంటున్నారు. రెండు లక్షల జనాభా ఉన్నప్పుడు మూడు మండలాలు చేయాల్సి ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరు స్పందించడం లేదని ప్రజలు, విద్యార్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అర్బన్, రూరల్ తాసిల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతి ఒక్కరు కోరుతున్నారు. రెండు కార్యాలయాలు ఉండాల్సి ఉండగా ఒకే కార్యాలయం ఉండగా పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. అందులో అధికారులు లేకపోవడం వల్ల పనులు కావడం ప్రజలు, విద్యార్థులు, రైతులు అంటున్నారు. జిల్లా అధికారులు ఇప్పటి కైనా స్పందించి గద్వాల తాసిల్దార్ కార్యాలయంలో ముగ్గురు ఆర్ఐ లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

కడుపు తీపి లేని అమ్మ..
కొడుకును కడతేర్చిన తల్లి..!
తన చేష్టలకు అడ్డొస్తున్నాడని హత్య
నీటి తొట్టిలో పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం

తల్లి చేతిలో మృతి చెందిన హరికృష్ణ

హరికృష్ణ (ఫైల్)

బిజినేపల్లి,మార్చి 21 ప్రభాతవార్త : కంటేనే అమ్మ అని అంటే ఎలా కడుపు తీపి లేని అమ్మ రాతి బొమ్మే కదా అన్న సినీ కవి పాటను నిజం చేస్తూ జరిగిన సంఘటన పలువురని కంటతడి పెట్టించింది. అల్లిపూర్ గ్రామంలో ఓ తల్లి తన చేష్టలకు అడ్డుస్తున్నాడని కన్న కొడుకునే కడతేర్చిన విషాదకర సంఘటన చోటు చేసుకుంది. గురువారం పోలీసులు కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు అల్లీపూర్ గ్రామానికి చెందిన డేగ రవిందర్, డేగ లక్ష్మిలు భార్యా భర్తలు. వీరికి ముగ్గురు కొడుకులు. పెద్ద కుమారులు ఇద్దరు గురుకుల పాఠశాలలో అక్కడే ఉండి విద్యాభ్యాసం చేస్తున్నారు. చిన్నవాడైన హరికృష్ణ తల్లిదండ్రుల వద్దే చేదోడుగా ఉంటూ గ్రామంలో చదువుతున్నాడు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే కుటుంబంలో రవిందర్ మద్యానికి బానిస కావడంతో లక్ష్మి అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తితో అక్రమసంబంధం ఏర్పరచుకుంది. హరికృష్ణ తన చేష్టలకు అడ్డు వస్తున్నాని కన్న కొడుకునే కడుపు తీపిలేకుండా హతమార్చింది. రవిందర్ గాఢనిద్రలో ఉండగా హరికృష్ణ (11)ను తలపై మోదడంతో అక్కడికక్కడే స్పృహ తప్పిపోయాడు. మృతి చెందాడు అనుకుని బెడ్‌షీట్లో చుట్టి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేసి ప్రమాద సంఘటనగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. ఉదయాన్నే కుటుంబీకులు, గ్రామస్తులు బాలున్ని ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే హరికృష్ణ తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు వైద్యులు పేర్కొనడంతో అనుమానంతో తల్లిని ప్రశ్నించారు. తానే కొడుకునే చంపినట్లు ఒప్పుకోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి లక్ష్మిని అప్పజెప్పారు. తండ్రి రవిందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

పదేండ్లలో పాలమూరును పట్టించుకోలే..!

- బీజేపీ, బీఆర్ఎస్ చేసింది శూన్యం
- కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే పగబట్టిండు
- నా గెలుపు రాహుల్ ప్రధాని కావడానికి తొలిమెట్టు
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి
- జడ్చర్లలో గేట్లు తెరిచినం : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- జడ్చర్లలో మీడియా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 21, ప్రభాతవార్త : పదేండ్లలో తెలంగాణను పాలమూరును ఆగం పట్టించారని రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ పాలమూరును పట్టించుకోలేదని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు గెలిపిస్తే పాలమూరును నిండా ముంచారని ద్రోహం చేసిన దుర్మార్గుడని దుయ్యబట్టారు. కేసీఆర్ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశాడని, సర్పంచ్, ఎంపీ టీసీ, జెడ్పీటీసీ ప్రజాప్రతినిధులకు అధికారం లేకుండా చేశాడని, రాష్ట్రంలో ఒకే కుటుంబం అన్ని రంగాలను శాసించిందని, అంతా తామే అన్నట్లు వ్యవహరించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు ఆత్మహత్య చేసుకున్న దుస్థితి దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదని, కేవలం తెలంగాణలో ఆ పరిస్థితి వచ్చిందన్నారు. 2014లో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ హయాంలో శ్రీకారం చుడితే పదేండ్ల అధికారంలో ఉండి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రాజెక్టు పూర్తి చేసేదన్నారు. కాంగ్రెస్ హయాంలో రాజీవ్‌గాంధీ ఆధ్వర్యంలో 72వ అమెండ్‌మెంట్ తీసుకొచ్చి స్థానిక సంస్థలకు జీవం పోశారని గుర్తుచేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిఅరాచక పాలన చూసినా నాయకులెవరూ కూడా బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపడంలేదన్నారు. పాలమూరు బీజేపీ నేతలకు మోడీతో మాట్లాడితే దమ్ములేదన్నారు. తమ పదవుల కోసం కొట్లాడుతారు తప్పా..పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయం ఎందుకు ప్రశ్నించరో చెప్పాలన్నారు. స్వయంగా మోడీ హామీ ఇచ్చినా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు విషయం నేటికీ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో నేడు పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఇక్కడి ఎమ్మెల్యేలు కూడా పాలమూరు అభివృద్ధికి కంకణబద్ధులై ఉన్నారన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి మరింత బలం చేకూరుతుందన్నారు. ఉప ఎన్నికలో మన్నె జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు.

వంశన్న గెలుపు ఖాయం:ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఎంపీ ఎన్నికల్లో పాలమూరు అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు రావాలంటే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలన్న ఎంపీని గెలిపించాలని కోరారు. జడ్చర్ల నియోజకర్గంలో రోడ్ల అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో -మిగతా4లో..

పార్లమెంట్ ఓటర్లు..

- మహబూబ్‌నగర్‌లో 16,80,417,
- నాగర్‌కర్నూల్‌లో 17,34,773
- మే 13న పార్లమెంట్ ఎన్నికలు
- జూన్4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయ సందడి..

@34,15,190

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 20, ప్రభాతవార్త : లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ సందడి మొదలైంది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరులోని రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు అధికార యంత్రాంగం ఎన్నికలక సమాయత్తమవుతున్నది. ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల లెక్క, పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక కేంద్రాలు, తదితర అంశాలపై ఎన్నికల అధికారం యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఈమేరకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఆయా కలెక్టర్లు వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఎన్నికల నియమావళిపై సమీక్షలు నిర్వహించారు. ఎన్నికల్ కోడ్ అమలులో ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలపై పలు సూచనలు చేశారు. వచ్చే నెల 18న అధికారికంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. జూన్4వరకు అంటే ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు కోడ్ అమలులో ఉన్నది. అయితే ఎన్నికల ఎన్నికల నామినేషన్ వేసే వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించడంతో ఈమేరకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు ఇతరులు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	272	1,28,268	1,30,37713	2,58,658
జడ్చర్ల	274	1,11,354	1,11,86305	2,23,222
దేవరకద్ర	289	1,18,372	1,20,70500	2,39,077
నారాయణపేట	270	1,16,261	1,19,25402	2,35,517
కొడంగల్	275	1,19,237	1,23,02010	2,42,267
మక్తల్	284	1,19,474	1,23,86301	2,43,338
షాద్‌నగర్	252	1,19,114	1,19,21113	2,38,338

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు ఇతరులు	మొత్తం ఓటర్లు
వనపర్తి	296	1,35,367	1,37,28204	2,72,653
గద్వాల	303	1,25,356	1,30,49911	2,55,866
అలంపూర్	290	1,17,997	1,21,07408	2,39,079
నాగర్‌కర్నూల్	259	1,18,764	1,19,36603	2,38,133
అచ్చంపేట	265	1,23,234	1,24,38205	2,41,621
కల్వకుర్తి	262	1,22,805	1,20,14809	2,42,962
కొల్లాపూర్	269	1,20,511	1,17,94305	2,38,459

ఇసుక డంపులను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

మిడ్జిల్‌కు మైన్స్ అధికారులు..

ఇసుక నిల్వలు ప్రదేశం పరిశీలన

ఇసుక నిల్వ కొలతల సేకరణ

ప్రైవేట్ పనులకు ఇసుక వినియోగంపై ఆరా

మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 21 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామ శివారులోని నిల్వ చేసి ఉన్న ఇసుకను తరలించేందుకు కొందరు జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పేరిట అనుమతులు పొంది అనుమతుల పేరట అక్రమంగా -మిగతా4లో..

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన..

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 21 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, ఈవీఎంల భద్రతకు అవసరమైన స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు సంబంధించి గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్‌కుమార్ పరిశీలించారు. కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలిచ్చారు. నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంల కేటాయింపు, పోలింగ్ కేంద్రాలకు తరలించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, అక్కడ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని తగు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు భద్రత తదితర అంశాలపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంట అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, కొల్లాపూర్ తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నర్సరీలో చెట్ల పెంపకం గురించి జిల్లా కలెక్టర్ ఆరా..

నర్సరీలో మెక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి టౌన్,మార్చి 21,ప్రభాతవార్త : హరిత హారం దృష్టిలో ఉంచుకొని గురువారం ఉదయం పెద్దమందడి మండలం జంగమయా పల్లి గ్రామ పరిధిలోని అటవీ శాఖ నర్సరీని సందర్శించి పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా సరైన విధంగా నీరు పోసి ఎప్పటికప్పుడు బ్యాగులు మారుస్తూ మొక్కలను సమీక్షించాలని సూచించారు. వచ్చే హరిత హారం కార్యక్రమానికి జిల్లాకు అవసరమైన మొక్కలు జిల్లాలోని నర్సరీల నుండే వాడుకునే విధంగా చూడాలని సూచించారు. మొక్కల పెంపకం గురించి ఆరా తీశారు. చనిపోయిన వారి స్థానంలో మరోమారు విత్తనాలు వేసి మొక్కలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పండ్ల మొక్కల పెంపకం పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీలో పని చేస్తున్న ఉపాధిహామీ తీశారు. తమకు దినసరి కూలి పెంచాలని కూలీలు కలెక్టర్ ను కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ కూలాలకు దినసరి వేదనం పెరిగే విధంగా కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం ఆమోదిస్తే తప్పకుండా పెరుగుతుందని తెలియజేశారు.

పల్లెల్లో పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్టుషాపులు..!

కిరాణం కొట్లు,నివాస గృహాల్లో మద్యం విక్రయాలు

మద్యానికి బానిసైన యువత,రోడ్డున పడుతున్న కుటుంబాలు

తు తు మంత్రంగా అధికారుల పర్యవేక్షణ

మానవపాడు మండలంలో బెల్టుషాపుల్లో పట్టుబడ్డ మద్యం సీసాలు

అలంపూర్ మార్చి 21 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఏ మారుమూల పల్లెకి పోయిన మద్యం ఏరులై పారుతోంది. ఒక్కో గ్రామంలో పుట్టగొడుగుల్లా 3 నుంచి 5 బెల్టుషాపులు ఉండగా మండల కేంద్రంలో ఆ సంఖ్య రెట్టింపైంది. ఈ రకమైన బెల్టుషాపుల నిర్వహణ దందాకు మద్యం షాపులు నిర్వహించే వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి వారి కనుసన్నల్లోనే ఈ తతంగమంత నడుస్తోందనే తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రధానం గ్రామాల్లో ఉన్న కిరాణం షాపులు, నివాస గృహాల్లో నే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కోరకమైన బ్రాండ్ పై ఒక్కోరకమైన రేట్లు నిర్ణయిస్తూ క్వాటర్‌పై 30నుంచి50రూపాయలు అదనంగా వసూలు చేస్తూ మద్యం విక్రయాలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా పల్లెల్లో 24గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో యువత మద్యానికి బానిసలై అనారోగ్యాలపై ఎంతో విలువైన జీవితాన్ని నాశనము చేసుకుంటున్నారని దీంతో కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అలంపూర్, ఉండవల్లి, మానవపాడు, వడ్డేపల్లి, రాజోలి, అయిజ, ఇటిక్యాల మండల కేంద్రాల్లోని విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసి బెల్టుషాపులను ప్రోత్సహించిందని ఈ ప్రభుత్వమైన బెల్టుషాపుల నిర్వాహణపై ప్రత్యేక చొరవ తీసుకుని ఆరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత ఉక్పైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్పైజ్ అధికారుల పర్యవేక్షణ లోపమా?

మద్యం టెండర్ లో షాపులు దక్కించుకున్న మద్యం వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి అధికారులకు నెల నెల ముడుపులు చెల్లిస్తున్నట్లు అందువల్ల వాళ్ళు ఇచ్చే కానులకు కక్కుర్తి పడి సంబంధిత అధికారులు అటువైపు వెళ్లకుండా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే తు తు మంత్రంగా వచ్చి పోవడం తప్ప చర్యలు శున్యమని వినికిడి అందుకు నిదర్శనం ఇటీవలే ఉండవల్లి మండలం జాతీయ రహదారి పుల్లూర్ టోల్ గేట్ సమీపంలో ఉన్న మద్యం షాపుల యువకుల వద్ద మితిమీరిన మద్యం సేవించి మాట మాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడ్డారు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఏపీ కర్నూలు పరిసర ప్రాంతం నుంచి మద్యం ప్రియులు అధిక సంఖ్యలో వస్తుంటారు. జాతీయ రహదారి పక్కన కూర్చుని మద్యం సేవిస్తూ భయాందోళన సృష్టిస్తున్నారని సంబంధిత ఎక్పైజ్ అధికారులు, పోలీసుల పర్యవేక్షణ లేదని అటు పోయే ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ నాయకులు పార్టీ మార్పుపై మాట్లాడే హక్కులేదు..

మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పార్టీ మారినోడే

విలేకరుల సమావేశంలో బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కొత్తకోట,మార్చి 21,ప్రభాతవార్త : కాంగ్రెస్ నాయకులకు పార్టీ మార్పు పై మాట్లాడే నైతిక హక్కు లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో - మిగతా4లో..

మంజూరైన నిధులపై సమాచారం ఇవ్వాలి..

అమరచింత మార్చి 21 ప్రభాతవార్త: అమరచింత మున్సిపాలిటీకి మంజూరైన నిధుల పై పూర్తి సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి , కే రాజన్న మాట్లాడుతూ, అమరచింత మున్సిపాలిటీ ఏర్పడి నాలుగుసంవత్సరాల అవుతుందని రాష్ట్ర ప్రభ్వుతం అమరచింత మున్సిపాలిటీకి ఎన్ని నిధులు కేటాయించిందని 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం పూర్తి సమాచారం ఇవ్వాలని ఆయన మున్సిపల్ అధికారులను కోరారు. అలగే అమరచింత మున్సిపల్ కేంద్రంలో అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారు ? మున్సిపాలిటీలో మిగులు బడ్జెట్ తో పాటు మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం మున్సిపాల్ అధికారులు జిరాక్స్ కాపీలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పట్టణ కార్యదర్శి, సామెల్,ప్రసాద్, కురుమన్న,మసల మణి,ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో మొదలైన క్యాంప్ రాజకీయాలు..

వనపర్తి టౌన్ మార్చి 21 ప్రభాతవార్త : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎం.ఎల్.సి అభ్యర్థి నవీన్ రెడ్డి మద్దతుగా క్యాంపు నియోజకవర్గంలోని కొంతమంది జెడ్పీటీసీలు ఎంపీటీసీలు ఆసక్తి చూపడం లేదు ఈ క్యాంప్ రాజకీయంలో వనపర్తి యొక్క మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ నిర్ణయిస్తారని,కొంతమంది కౌన్సిలర్లు బయలుదేరి వెళ్ళారు.వీరిలో అనారోగ్యము చేత చిట్యాల, ఏదుల,పాతపల్లి ఎంపీటీసీలు హాజరు కాలేదు.రంగాపూర్,ఘనపూర్,బుద్దారం ఎంపీటీసీలు,కౌన్సిలర్స్ మంజుల,పాకనాటి కృష్ణ వ్యక్తిగత పనుల వల్ల రెండు రోజులలో క్యాంపుకు హాజరవుతున్నారు. బీచుపల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న నిరంజన్ రెడ్డి క్యాంపుకు బయలు దేరిన ప్రజాప్రతినిధులతో కలిసి నిరంజన్ రెడ్డి బీచుపల్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి నాయకత్వములో నవీన్ రెడ్డిని గెలిపిస్తామని అన్నారు.

సెల్‌టవర్‌ను మూసివేయాలని డిమాండ్

వనపర్తి టౌన్,మార్చి 21,ప్రభాతవార్త : వనపర్తి పట్టణంలోని శ్వేత నగర్ కాలనీలో సెల్ టవర్ ను మూసివేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.ఇంటి యజమానికి ఎంత చెప్పినా వినడం లేదని ఒక సంవత్సరం నుండి సెల్ టవర్ నిర్వహణ యజమానికి కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది.పలుమార్లు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసిన కూడా యధావిధిగా నడుపుతున్నారు.ఈ యొక్క సెల్ టవర్ వల్ల చిన్నపిల్లల ప్రాణాలకు వృద్దులకు,గుండె సంబంధిత వ్యాధులు వాటిల్లుతాయని ప్రజల యొక్క ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ఒక టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని 22 వార్డ్ కౌన్సిలర్ చీర్ల సత్యం మరియు కాలనీవాసులు వినపం చేస్తున్నారు.ఈ యొక్క కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రిటైర్డ్ హెడ్మాస్టర్ గౌడ్, ఎం ఏ ఖాదర్,సయ్యద్ ఇలియాజ్,కృష్ణ గౌడ్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి..

ఆత్మకూర్,మార్చి 21,ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి ముట్లంపల్లి తోంపల్లి గ్రామాలలో నెలకొన్న మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం రోజు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు.గత ఎన్నికల్లో భాగంగా పై గ్రామాలలో నెలకొన్న నీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరిస్తారని వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటానని వాకిటి శ్రీహరి హామీ ఇవ్వడంతో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి శ్రీనివాసులు తదితరులు గురువారం రోజు మక్తల్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు.ప్రస్తుతం పై మూడు గ్రామాలకు మంచినీటి సమస్య పరిష్కారానికిగాను 4.5 లక్షల రూపాయల నిధులు విడుదలైనప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పనులు చేపట్టలేక పోతున్నామని అధికారులు నిసాహిత వ్యక్తం చేస్తున్నారని వారు ఎమ్మెల్యే పరిష్కారానికి యుద్ధ ప్రతిపదికన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లుగా వారు తెలిపారు.

మల్లేపల్లి వాసి చైనాలో గుండెపోటుతో మృతి..

భౌతిక కాయాన్ని ఇండియాకు పంపాలని కుటుంబ సభ్యులు వేడుకోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని అభ్యర్థిస్తున్న కుటుంబ సభ్యులు

సేవకుల జ్ఞానానంద (ఫైల్)

రాజాపూర్,మార్చి 21 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన సేవకుల జ్ఞానాచంద్ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ గతనెల ఫిబ్రవరి 22వ తేదీన చైనాకు వెళ్లారు. అతను మార్చి 16న అందుబాటులో లేడని, మార్చి 17న మరుసటి రోజు ఉదయం భారతీయ స్నేహితుడి నుండి కాల్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని స్నేహితుడి సహకారంతో అక్కడి లిక్సియన్ ఆసుపత్రిలో వైద్యులు అతనికి సిపిఆర్ నిర్వహించారు. కానీ అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. అతని మృతదేహాన్ని లికౌంటీ క్రిమిటోరియంలోని మార్చురీలో ఉంచామని కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. చైనాకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన పాలమూరు జిల్లా వాసి భౌతిక కాయాన్ని భారతదేశానికి పంపాలని కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని మృతుడి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సేవకులు జ్ఞానానంద్ గతంలో వియత్నాం, చైనాలో కొన్నాళ్లు పనిచేశారు. ఈనెల మార్చి 19న స్వదేశానికి వచ్చేందుకు టికెట్ బుక్ చేసుకున్న జ్ఞానానంద్ అంతలోనే గుండెపోటుతో మృతి చెందడం వల్ల ఆయన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భౌతిక కాయాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించి జ్ఞానానంద్ భౌతిక కాయాన్ని ఇండియాకు తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

బీడీ కార్మికుల హక్కులకై పోరాడుదాం..

టిఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు పి.యాదగిరి డిమాండ్

చిన్నచింతకుంట,మార్చి 21 ప్రభాతవార్త : బీడీ కార్మికుల హక్కులకై యాజమాన్యాలతో పోరాడేం దుకు కార్మికులు సిద్ధం కావాలని టిఎఫ్‌టియుకు అనుబంధ సంఘమైన తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రములోని వజీర్ బీడీ ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడుతూ గతంలో చేసుకున్న ఒప్పందం ఈనెల 31తో ముగుస్తుంది. బీడీ కూలీ పెంపుతో పాటు పిఎఫ్‌లో యజమాని వాల వేయాలన్నారు. పిఎఫ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, చట్ట ప్రకారం గ్రాటివిటీ ఇవ్వాలని కార్మికుల హక్కులను కాలరాస్తున్న యజమానులకు దిమ్మ దిరిగేలా బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈనెల 24న చిన్నచింతకుంటలో జరుగుతున్న బీడీ కార్మిక సభకు బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుమ్మరి వెంకటన్న, ఈరన్న, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు..

పోలింగ్ స్టేషన్లను సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్

వనపర్తి టౌన్,మార్చి 21,ప్రభాతవార్త : పోలింగ్ కేంద్రాల రూట్ నిర్ధారణ కొరకు గురువారం ఉదయం ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లను రూట్ వారీగా తిరుగుతూ పరిశీలించారు.ప్రాథమిక పాఠశాల ముందలి తాండా పోలింగ్ కేంద్రం సంఖ్య 13,వెనకి తండా 12,మామిడిమాడాలో 10,11,సలకెలాపూరులో 15,16 అప్పరెడ్డిపల్లిలో 17,18 మల్కిమియాపల్లిలో 20,బొడు గట్టు తాండా లో 19/ఎ,రోడ్డు మీది తాండాలో 23 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించారు.డూప్లికేట్ ఓట్లు ఏమైనా ఉన్నాయా అని బి.ఎల్.ఒ లను అడిగి తెలుసుకున్నారు.85 సంవత్సరాల వయస్సు దాటిన వారిని,దివ్యాంగుల పేర్లను జాబితాలో మార్కింగ్ చేయాలని ఆదేశించారు.పోలింగ్ స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు (లైట్లు,ఫాన్స్,తాగు నీరు,మరుగుదొడ్లు,ర్యాంప్) వంటి మౌలికవసతులు ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు.పోలింగ్ స్టేషన్ల సందర్శనలో భాగంగా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలను సైతం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలకు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలని,బడి బయట పిల్లలు ఎవరూ ఉండకూడదని ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలని చెప్పారు.మామిడిమాడ,వెనికి తండా, ముందరి తాండ పాఠశాలల్లోని విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు,సామర్థ్యాలను పరిశీలించారు.గణితం,తెలుగు అభ్యసన సామర్థ్యాల్ని పరిశీలించారు.వెనికి తండా అంగన్వాడిలో స్టాక్ రిజిస్టర్,పోషకహార సామాగ్రిని నిలువలను పరిశీలించారు.గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరం చేయాలని అధికారులను ఆదేశించారు.ఘనపూర్ ఎమ్మార్వో ఆర్.పాండు,ఎంపీడీవో టి.వెంకటాచారి,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను వత్తాసు పలికి రైతులను మోసం చేసింది బిఆర్ఎస్..!

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్

గద్వాల ప్రతినిధి మార్చి 21 ప్రభాతవార్త: అధికారంలో ఉన్నప్పుడూ రైతులను పట్టించుకోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముసలి కన్నీరు కారుస్తూ పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనీఫ్ అహ్మద్ తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంటులో రైతు నల్ల చట్టాలకు అనుకూలంగా మద్దతు నిచ్చి, రైతు పంటలు కొనండని కాళ్లావేళ్లా పడ్డా నాడు కనికరించలేదు, రైతు పండించిన పంట నీటిలో కొట్టుకుపోయి రోదిస్తున్న పట్టించుకోని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని నిందిస్తే ఊరుకోం అని బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెట్టారని, అదే రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు నష్టపరిహారం అందించాలని అధికారులకు ఇప్పటికే అదేశాలు జారీ చేశారని రైతులను ఆదుకోనే విధంగా ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువులు పంపిణీ, రైతు బంధు పథకం ద్వారా రైతులకు వారి అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగిందని, గతంలో రైతులను పక్కన పెట్టి ఆగర్భశ్రీమంతులకు రైతు బంధు పేరుతో డబ్బులు దోచిపెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. రైతులను బీడీలు వేసి జైలుకు తరలింపు చేసినప్పుడు బిఆర్ఎస్ నాయకులు కళ్లు మూసుకుని ఉన్నారని, ఆయన ప్రశ్నించారు. గతంలో నిరుద్యోగ యువకులను మోసం చేస్తే ఇప్పుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇచ్చామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తే బిఆర్ఎస్ నాయకులకు కడుపుమంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భవిష్యత్తు తరాల కోసం మన మహబూబ్‌నగర్ ప్రజలు ఏకతాటిపైకి రావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత 70 సంవత్సరాల అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా మన మహబూబ్‌నగరన జిల్లా ముద్దుబిడ్డ, ఈ ప్రాంతంలోని సాధకబాధకాలు ఎరిగిన మన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇలాంటి అవకాశం మనకు లభించడం ఈ ప్రాంతం ప్రజలకు అదృష్టమనే చెప్పాలి. ఎందుకంటే గతంలో ఏ ప్రాంతానికి చెందిన నాయకుడు ఆ ప్రాంత అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు మన మహబూబ్‌నగర్ జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇది గ్రహించాలి అని, మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానానికి ముఖ్యమంత్రి ఇంచార్జీగా ఉన్నారు. కాబట్టి మనం ఉమ్మడి జిల్లాకు చెందిన రెండు పార్లమెంటు స్థానాలు అత్యధిక మెజార్టీతో గెలిపించి మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి బహుమతిగా ఇవ్వడమే కాదు, మహబూబ్‌నగర్ ఎంపి గెలుపు రేవంత్‌రెడ్డి కి బలం చేకూరుతుందని ఆయన చెప్పారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి నీరుగార్చకుండా, ప్రాంతం కానీ వ్యక్తికి పట్టం కట్టితే, నిలువునా మోసం చేసి అభివృద్ధి నంతా సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ కు తరలించారని కానీ రాజకీయ బిక్ష పెట్టిన మహబూబ్‌నగర్‌ను మోసం చేసి విస్మరించిన వ్యక్తి కెసిఆర్ అని, ఇంటికో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులకు ఆశ చూపి, డబుల్‌బెడ్‌రూమ్ స్కీంతో స్కాం చేసి, లిక్కర్ దందాలో వాటాలు పెంచుకుని తెలంగాణ పరువును బజారులో పెట్టారు. బిఆర్ఎస్ నాయకులు అని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?? అని ఆయన బిఆర్ఎస్ ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ హోదా ఇస్తామని పాలమూరు సాక్షిగా హామి ఇచ్చిన మోడి మొఖం ఎలా చెల్లుతుందని, ఏడాదికో రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ పాయని, ధరలు ఆకాశాన్ని తాకిన పేదవాడి బతుకులు భారం చేసింది కేంద్రంలోని బిజెపి సర్కారు కాదా??? 400 సిలిండర్ ధర 1200 పెంచింది. మీరే కదా ఆదాని, అంబానీ ఆస్తులు పెంచుకునేలా, బ్యాంకు లనుంచి కోట్ల రూపాయలు తీసుకుని, ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన లలిత్ మోడీ, నీరవ్ మోడి, కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా ల నుంచి చిల్లీ గద్వ కూడా ఇప్పటికీ చెల్లించని వ్యాపారస్తులను ఎందుకు కేంద్ర ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ బిజెపి పార్టీ లు ప్రజల సంక్షేమం మరిచిపోయారు. పార్టీలకు ఆదాయ వనరులు పెంచుకునేలా ఎలక్ట్రోడ్ బాండ్ పేరుతో నిధులు సమకూర్చే ప్రణాళికలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ను తరిమి వేశారు. ఇక ఇప్పుడు దేశంలో బిజెపి వంతు వచ్చిందని ఆయన ప్రజలకు తెలిపారు. పార్టీలకు అతీతంగా మీరు మహబూబ్‌నగర్ అభివృద్ధి కావాలంటే మీరు వేసే ఒక్కో ఓటు అటు రేవంత్‌రెడ్డి కి బలాన్ని ఇస్తుంది. ఇక్కడ అభివృద్ధి ఫలాలు అందరికి అందిస్తుందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పత్రికా విలేఖరులు కూడా ప్రజలను చైతన్యపర్చండి, మహబూబ్‌నగర్ జిల్లా కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఇప్పుడు మనకు దొరికిన గొప్ప అవకాశం మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యులు వంశీచంద్‌రెడ్డి ని, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి విజయంలో భాగం కావాలని మహబూబ్‌నగర్ ప్రజలకు ఓటర్లను అభ్యర్థిస్తున్నామని ఆయన మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను కోరారు.

ఉలిగేల్లిలో ఈతకు వెళ్లి బాలుడు మృతి..

కన్నీరు మున్నీరైన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థిని విద్యార్థులు

విద్యార్థి మృతి కారణంగా సంతాప సూచికగా సెలవు ప్రకటించిన పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు

ఉలిగేపల్లి గ్రామనికి చేరుకొని విద్యార్థి వీరేందర్ భౌతిక కాయం పై పూలమాలతో నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు,విద్యార్థులు

మల్దకల్ మార్చి 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఉలిగేపల్లి గ్రామంలో బుధవారము బోయ వీరేందర్ (13) ఈతకు వెళ్లి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి ఈతకు వెళ్లాడు . సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు అనుమానంతో బావి దగ్గరికి వెళ్లి చూస్తే బావిలో శవం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు రోదనలతో విషాదఛాయలు అలుముకున్నాయి.విద్యార్థి వీరేందర్ చనిపోయిన విషయం తెలుసుకున్న బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు గురువారం ఉలిగేపల్లి గ్రామానికి చేరుకొని వీరేందర్ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. తల్లిదండ్రులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.అదేవిధంగా పాఠశాలకు ఒక్కరోజు సెలవు ప్రకటించారు.అదేవిధంగా ఎండాకాలం విద్యార్థులు బోరు బావులు దగ్గర ఈతరాని చిన్న పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రతగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్.విజయ్ భాస్కర్,ఉపాధ్యాయులు కె.విజయ్ భాస్కర్,ప్రతాప్ రెడ్డి,వి.శ్రీనివాసులు,మస్తాన్ మియా,రత్నమాల,భాగ్యలక్ష్మి,ఆజిత్,వేణు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రధాన లక్ష్యం..

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వెంకట్ రాములు.. బాధితులకు ఎల్.ఓ.సి అందజేత

చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు

పెబ్బేరుమార్చి21 ప్రభాతవార్త: సబ్బండ వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రంలోని 4వ వార్డు వినాయకనగర్ కు చెందిన కొండ్రా చిన్న రంగన్న గత కొన్ని రోజులుగా కాలేయ వ్యాధి సమస్యతో బాధపడుతున్నాడని తెలిపారు. వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని ఏ.ఐ.పీ.సీ కోఆర్డినేటర్,వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పరామర్శించినట్లు చెప్పారు.బాధితుని అనారోగ్య సమస్యను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు.స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి బాధితునికి మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్.ఓ.సి ద్వారా రూ.2,50,000వేల రూపాయల చెక్కును అందజేశామన్నారు.ఈ సందర్భంగా బాధితుని కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాధితుని కుటుంబ సభ్యులున్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన

వివిధ రాజకీయ పార్టీల నాయకులు..

లక్ష్మారెడ్డి కుటుంబాలను పరామర్శిస్తున్న డీకే అరుణమ్మ

లక్ష్మారెడ్డికి నివాళి అర్పిస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి,దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే,ఆల వెంకటేశ్వర్ రెడ్డి

అమరచింత,మార్చి 21,ప్రభాతవార్త : అమరచింత ఎత్తిపోతల పథకం అధ్యక్షులు సౌజన్య రెడ్డి భర్త కమిట లక్ష్మారెడ్డి ఇటీవల మరణించారు.కమిట లక్ష్మారెడ్డి దశదినకర్మ గురువారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని సౌజన్య రెడ్డి స్వగృహంలో నిర్వహించారు. లక్ష్మారెడ్డి చిత్రపటానికి మాజీ మంత్రి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు,డీకే అరుణమ్మ ఘన నివాళి అర్పించారు. అలాగే మక్తల్ మాజీ ఎమ్మెల్యే,చిట్టెం రామ్మోహన్ రెడ్డి,దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ దేశై ప్రకాశ్ రెడ్డి లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.అలాగే ఆత్మకూరు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ్ గౌడ్ మాతృమూర్తి కృష్ణమ్మ ఈనెల16న అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణమ్మ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ స్వగ్రామంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఆత్మకూర్ మార్కెట్ మాజీ అధ్యక్షులు రాజు,బిజెపి సీనియర్ నాయకులు మరాటి అశోక్ కుమార్ వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి వెంట ఉన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు..



మాగనూరు,మార్చి 21 ప్రభాతవార్త : వడ్వాట్ అసలే ఎండా కాలంపైగా కరెంటు కోతలు అటు వంటప్పుడు అందరికి విద్యుత్ ఆదా చేయాలనే ఆలోచన ఉంటుంది. కాని వడ్వాట్ గ్రామంలో మాత్రం పట్టపగలు వీధిదీపాలు వెలుగుతున్నాయి. కానీ అధికారులు, గ్రామపెద్దలు ఎవరు పట్టించుకోవడం లేదు. చూసి చూడనట్లు తిరుగుతున్నారు. ప్రతి స్తంభానికి వరుసగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యు త్ ఆదా చేయల్సిన సమయంలో వృధా చేయడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

మున్సిపల్ చైర్మన్ బీఎస్ చైర్మన్ కేశవ్‌ను అభినందించిన కాంగ్రెస్ నాయకులు..

గద్వాలప్రతినిధి మార్చి21 ప్రభాతవార్త: మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.గురువారం గద్వాలజిల్లా కేంద్రంలోని మున్సిపల్‌చైర్మన్ బి.యస్.కేశవ్ స్వగృహం నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు తిమ్మోతి,నాగరాజు,సురేష్,చిన్నలు మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వారికి బొక్కే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.కోటేష్ నాగులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతలో ఘనంగా బీరప్ప పండుగ..

ఉప్పునుంతల, మార్చి 21 ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉప్పునుంతలలో కురుమ కులస్తుల కులదైవం బీరప్ప పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను బీరప్ప ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం బీరప్పకు బోనాలను సమర్పించారు. గ్రామంలో నెలకొన్న గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఆయా గ్రామాల నుంచి బంధుమిత్రులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి బీరప్ప పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

ఈ రోడ్డు సంగతి అంతేనా..?

నరక ప్రాయంగా మారిన జినుకుంట రామగిరి రోడ్డు

ఉప్పునుంతల,మార్చి 21 ప్రభాతవార్త: అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మండలంలో నరకప్రాయంగా మారిన రోడ్డు మరల నిర్మాణం కోసం నిధులు పుష్కలంగా ఉన్నప్పటికి కాంట్రాక్టర్ అలసత్వంతో, పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యంతో నరకాన్ని అనుభవిస్తున్న రహదారి పనులు అంతేనా అని ఆ మార్గ గుండా ఉన్న గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం జినుకుంట నుంచి పోలేపల్లి మీదుగా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, కల్వకుర్తి మండలం రామగిరి వరకు పంచాయతీరాజ్ శాఖ నుండి దాదాపు 6 కోట్ల మంజూరైనప్పటికి సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో పనులు ప్రారంభించకపోవడంతో ఈమార్గంగుండా వెళ్తున్న ప్రజలు, వాహన చోదకులు దుమ్మెత్తి పోస్తున్నారు. పనులు చేయడానికి గుత్తేదారు ముందు కొచ్చి టెండర్ వేసినప్పటికి నేటికి ప్రారంభించకపోవడం ఎవరి నిర్లక్ష్య వైఖరో అర్థం కాకుండా ఉంది.కానీ ఈ మార్గం గుండా వెళ్తున్న ప్రతి ఒక్కరూ అధికారాలను, సదరు కాంట్రాక్టర్ పట్ల విరుచుకుపడుతున్నారు. సంబంధిత అధికారులుగుత్తేదారుల పట్ల చొరవ తీసుకోకుండాఎందుకు నాటకమాడుతు న్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ఈరోడ్డు మార్గం గురించి చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ

సహాయ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

ఉప్పునుంతల,మార్చి 21 ప్రభాతవార్త: మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాలను అచ్చంపేట ఆర్డీఓ మాధవి గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాలలో కల్పించాల్సిన వసతులను పరిశీలించారు. మండలంలో అన్నిసహాయక పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు. సహాయక పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాను ఆమె పరిశీలించారు. పోలింగ్ కంటే ముందే ఆయా కేంద్రాలలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు తదితర కనీస వసతులను కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ శ్రీకాంత్‌కు ఆమె సూచించారు. ఆర్డీఓతో పాటు స్థానిక తహసిల్దార్ శ్రీకాంత్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్ లింగ బలిజ బాలానగర్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

లింగాయత్ లింగ బలిజ బాలానగర్ మండల కమిటిని సన్మానించిన దృశ్యం

బాలానగర్,మార్చి21 ప్రభాతవార్త: మండల లింగాయత్ లింగ బలిజ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గురువారం ఈ మేరకు లింగాయత్ లింగ బలిజ ఉమ్మడి జిల్లా కమిటి ఇంఛార్జి కొండవీరన్న, మహబూబ్‌నగర్ గౌరవ అధ్యక్షులు సిద్ధిలింగం,జిల్లా అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి వినోద్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్ తదితరుల సమక్షంలో లింగాయత్ లింగ బలిజ మండల నూతన గౌరవ అధ్యక్షునిగా శరణయ్య,అధ్యక్షులుగా రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా బసవరాజ్ తదితరుల కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.అనంతరం మండల మహిళా కమిటి గౌరవ అధ్యక్షురాలుగా రాజేశ్వరి,అధ్యక్షురాలిగా సునిత, ప్రధాన కార్యదర్శిగా మమత, కోశాధికారిగా వసంత తదితర కమిటి సభ్యులను మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగశ్రీ,ప్రధాన కార్యదర్శి శ్రీదేవితదితరుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ లింగాయత్ లింగ బలిజ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు లింగాయతుల అభ్యున్నతి కోసం పాటుపడుదామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

వనపర్తి టౌన్,మార్చి21,ప్రభాతవార్త: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం.నగేష్ అన్నారు.పోలింగ్ కేంద్రాల రూట్ నిర్ధారణ కొరకు గురువారం ఉదయం పెబ్బేరు,శ్రీరంగాపురం మండలాల పరిధిలోని దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లను రూట్ వారీగా తిరుగుతూ పరిశీలించారు. పెబ్బేరు మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 196,197, 198, 199,200,201,202,203,204,205,242,243 లను, శ్రీరంగాపురం మండల పరిధిలో 230,231,232,237, 238,239,240, 241, 211,212 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించారు.డూప్లికేట్ ఓట్లు ఏమైనా ఉన్నాయా అని బి.ఎల్.ఒ లను అడిగి తెలుసుకున్నారు.85 సంవత్సరాల వయస్సు దాటిన వారిని,దివ్యాంగుల పేర్లను జాబితాలో మార్కింగ్ చేయాలని ఆదేశించారు.పోలింగ్ స్టేషన్లలోకనీస మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు.పెబ్బేరు ఎమ్మార్వో బీ లక్ష్మి,ఆర్ ఐ రవీందర్, శ్రీరంగాపురం ఎమ్మార్వో మురళి,ఆర్ఐరాధా కృష్ణ ఎన్నికల అధికారుల పాల్గొన్నారు.

మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ

గద్వాల ప్రతినిధి మార్చి21 ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లా మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్స్పెక్టర్‌గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా రాంగరెడ్డి జిల్లా నుండి ఆయన జోగలాంబ గద్వాల జిల్లా రాయల్టీ ఇన్స్పెక్టర్‌గా బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.ఇసుక,కంకర,మట్టి ధర ఇచ్చేవారు తప్పనిసరిగా రాయల్టీ చెల్లించాల్సి ఉంటుందని రాయల్టీ చెల్లించకుండా వ్యాపారం నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చారిక చేశారు.ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని అనుమతులు తీసుకోవాలని రాయల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సజావుగా సాగుతున్న పది పరీక్షలు

- పదో తరగతి పరీక్షల కేంద్ర పరిశీలన
- విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 21 ప్రభాతవార్త: జిల్లాలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద కొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న 2 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పరీక్షలు కొనసాగుతున్న తీరునువారు పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఎఎన్ఎం ఏర్పాటుతో అత్యవసర మందులు ఏర్పాటును పరిశీలించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని, మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు ఉన్నాయా అని అడుగగా అన్ని వసతులు ఏర్పాటు చేశామని చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలని, జిల్లా కలెక్టర్ సూచించారు.పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌తో మరియు ఎలక్ట్రానిక్ పరికరాలతో ఎవరిని అనుమతించవద్దని భద్రతను సిబ్బందిని ఆదేశించారు. గురువారం నిర్వహించిన ఆంగ్ల పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10526 మంది విద్యార్థులకు గాను 10504 మంది విద్యార్థులు నేటి ఆంగ్ల పరీక్షకు హాజరు కాగా 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ డీఈఓ ఫ్లయింగ్ సా ్వడ్ బృందాలు 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

- తెలంగాణ రాష్ట్ర అటవి అకాడమీ అసిస్టెంట్ కోర్స్ కో ఆర్డినేటర్ వంశీకృష్ణ
- టిబిజిలో ఘనంగా అంతర్జాతీయ అటవి దినోత్సవం

మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 21 ప్రభాతవార్త: స్థానిక డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవ వైవిధ్య పరిశోధన విద్యా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవి అకాడమీ అసిస్టెంట్ కోర్స్ కో ఆర్డినేటర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. వీరిని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య పర్యావరణ హిత బొకేతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు అకాడమీలో శిక్షణ పొందుతున్న 35 మంది అటవి క్షేత్రాధికారులు తెలంగాణ బొటానికల్ గార్డెన్ సందర్శనార్థం విచ్చేశారు. గార్డెన్‌లోని వివిధ భాగాలను సందర్శించి అంతరించిపోతున్న సీతా అశోక మొక్కను నాటి నీళ్లు పోశారు. ల్యాబ్‌లో ఉన్న పాములను అదేవిధంగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హెర్బేరియం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ మాట్లాడుతూ అడవులే మానవాళికి రక్ష అని, అడవుల నుండి మానవాళికి అవసరమైన ఆహారం, ఔషధము, కలప ఇతర సామాగ్రితో పాటు జీవించడానికి అవసరమయ్యే ఆక్సిజన్‌ను అందిస్తాయన్నారు. వాటిని సంరక్షించుట మనందరి బాధ్యత అని తెలిపారు.గార్డెన్ సమన్వయకర్త డా.బి.సదాశివయ్య మాట్లాడుతూ అడవులను కాపాడే సైనికులు అటవిక్షేత్రాధికారులు అని దేశ రక్షణలో సైనికులు ఎలా కష్టపడుతున్నారో అలాగే వీరు కూడా అడవులను కాపాడుతున్నారని శిక్షణా అటవి క్షేత్రాధికారులనుద్దేశించి అన్నారు. 202 నుండి ఐక్యరాజ్య సమితి వారు మార్చ్ 21ని అంతర్జాతీయ అటవి దినోత్సవంగా పరిగణించారనిఅప్పటినుండి అనేక దేశాలు ఈ దినోత్సవం జరుపుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక అంశంతో ఈ దినోత్సవం ఒక ప్రత్యేక అంశంతో ఈదినోత్సవం జరుపుకున్నారు. ఈ సంవత్సరం అడవులు, ఆవిష్కరణలు, మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు అనే నేపథ్యంలో జరుపుకుంటున్నాం. అనేక సమస్యలకు అడవులు పరిష్కారాన్ని చూపుతాయని తెలిపారు.అనంతరం శిక్షణా అధికారులు అక్షయ్ గైక్వాడ్, మనీషాలు మాట్లాడుతూ ప్రపంచ అటవి దినోత్సవం రోజున తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. గార్డెన్ అభివృద్ధి చేసినతీరు ఆకర్షించిందన్నారు. విద్యార్థుల పాత్రపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి వంశీకృష్ణ మాట్లాడుతూ మేమంతా అటవిశాఖలో పనిచేస్తున్నా ఎక్కువ అడవుల సంరక్షణ గురించి తెలుసుకోలేకపోతున్నామని, కానీ ఈ కళాశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ బొటానికల్ గార్డెన్ ఒక్కటి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో ఉన్న అడవులు చూసినట్టే అన్నారు. అంత అద్భుతంగా గార్డెన్ ఉందన్నారు. శిక్షణ పొందుతున్న అటవీ క్షేత్రాధికారులు వారి పాఠ్య ప్రణాళికలో భాగంగా అనేక అటవీ ప్రాంతాలు తిరిగినా ఇంత జ్ఞానం రాదని ఇక్కడ అనేక రకాల మొక్కలుండటం వల్ల ఉపయుక్తంగా ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సదాశివయ్య ముఖ్య అతిథిని సన్మానించారు. పొలికి చెట్టు ఫలాలు,విత్తనాలతో చేసిన మాలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. శిక్షణాధికారులు కళాశాల ప్రిన్సిపాల్‌ను మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి రమాదేవి, వాలంటీర్లు రాహుల్, వీరాంజనేయులు, మేఘన, అనసూయ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో సందర్శిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు

మాట్లాడుతున్న కరస్పాండెంట్ హన్సీ

ఆత్మకూర్, మార్చి21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఆత్మకూరు పట్ట ణంలోని ఎం.వి. రామన్ పాఠశాలలో గడచిన మూడు రోజులుగా కొనసాగుతున్నటువంటి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజ మాన్యం 35వవార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల వైజ్ఞానిక ప్రశ్నలకు గాను వండర్ ఆఫ్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకోవడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా గురువారం రోజు విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ హన్సీ శ్రీధర్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ పాఠశాల ప్రాధాన్యతగా పేర్కొంటున్నామని ఆమె అన్నారు. మూడు రోజులు లోనే 650 వైజ్ఞానిక ప్రశ్నలు ఏర్పాటు చేసి వండర్ ఆఫ్ బుక్‌ఆఫ్‌రికార్డు సొంతం చేసుకోవడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని విద్యార్థులకు ఉపా ధ్యాయ సిబ్బందికిఅంకితం చేస్తున్నట్లుగా ఆమె పేర్కొన్నారు. అంతే కాకుండాగురువారం ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకర్షించాయి ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులతో పాటుగా ఆత్మకూర్ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పాఠశాల యాజమాన్యం శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తోంది

-బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బీసమొళ్ల యోసేఫ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బీసమొళ్ల యోసేఫ్

కల్వకుర్తి, మార్చి21 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ ఒంటరిగానే పోరాటం చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి బీసమొళ్ల యోసేఫ్ పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలో బహుజన్ సమాజ్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎట్టి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి బీసమొళ్ల యోసేఫ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కుట్రలకు బహుజనులు బలి కావొద్దని, కేసీఆర్ జిత్తుల మారి నక్క అని విమర్శించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కేసీఆర్,ఇప్పుడు బహుజనులను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుట్రలను ఛేదుగా ఎదుర్కొని బీఎస్పీ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలోకి వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు కానీ పార్టీ కార్యక్రమాలు ఎవ్వరికి కోసం ఆగవని, నిరంతరం నడుస్తునే ఉంటాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ 17 స్థానాల్లోఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఏ కూట మితో బీఎస్పీ పార్టీకి పొత్తులు లేవన్నారు. రానున్నపార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో కల్వకుర్తి అసెంబ్లీ కార్యదర్శి రమేష్ నాయక్, రాజు, సామాట్ర్, హెచ్‌సీయూ విద్యార్థి రమేష్, మండల ఇన్‌చార్జికావలి మహేష్, మండల అధ్యక్షులు రమేష్, మహేష్, జంగయ్య, శ్రీను, వెంకటేష్ ఉన్నారు.

ప్రయాణీకులకు ఫిల్టర్ వాటర్‌తో చలివేంద్రం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నంబావి,మార్చి 21 ప్రభాతవార్త: మండల కేంద్రంలో వెల్డింగ్ షాపు యజమాని సయ్యద్ తన కుటుంబ సభ్యులు హుస్సేన్‌మియా, ముస్రత్ భానుల జ్ఞాపకార్థం బస్‌స్టాప్ దగ్గర ఫిల్టర్ నీటి కూలింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. గత మూడేళ్లగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆయన నేడు వాటర్ కూలర్‌తో చలివేంద్రాన్ని కొల్లాపూర్ ఆర్టీసి డిపో మేనేజర్ ఉమా శంకర్‌గౌడ్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చడం ఎంతో ఉపకారం అని చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సయ్యద్‌ను పలువురు అభినందించారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ప్రతిరోజు నిత్యం వివిధ గ్రామాల ప్రజలు వారి అవసరాల కోసం చిన్నంబావి మండల కేంద్రానికి వస్తుంటారని వారికి తాగునీటికి చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహి ళా అధ్యక్షురాలు అగ్గన్నగారి శ్రీలత ప్రతాప్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు జంగ బీచుపల్లి యాదవ్, పసుపుల రంజిత్‌కుమార్, చిన్నంబావి మండలం కిసాన్‌సెల్ అధ్యక్షుడు నంది పుల్లారెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న, తెలుగు మధు, ఆంజనేయులు, బొల్లు నరసింహ, బాలగౌడ్, శరత్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ లెక్కింపు

73 రోజుల్లో రూ.45,18,974రూపాయల ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు

గద్వాల మార్చి 21 ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అలంపూర్ శ్రీజోగులాంబ,బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో 73 రోజుల జోగులాంబ,బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ అధికారులు గురువారం నిర్వహించారు. మొత్తం 45,18,974 రూపాయలతో పాటు విదేశీ కరెన్సీ,47.330 గ్రాముల మిశ్రమ బంగారం,397.78గ్రాముల వెండి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పురేందర్ కుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ శాఖఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ,ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు,ఆలయ ప్రధాన అర్చకులు దండిగల్ ఆనంద్ శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా మైనింగ్ ఏడిగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ

గద్వాల మార్చి 21 ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లా మైనింగ్ అసిస్టేంట్ డైరెక్టర్‌గా వెంకటరమణ గురువారం బాధ్యతలు చేఎట్టారు. సాధారణ బదీలీలో భాగంగా ఇక్కడ ఏడి మైనింగ్ గా పనిచేస్తున్న విజయరామరాజు సూర్యపేట జిల్లాకు బదీలిపై వెళ్లారు. అక్కడ ఏడిగా పనిచేస్తున్న వెంకటరమణ జోగులాంబ గద్వాల జిల్లాకు ఏడిగా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇసుక,కంకర,మట్టిని తరలించుకోవాలని,చట్టానికి విరుద్ధంగా తరలిస్తే వారిపై కఠనంగా వ్యవహరిస్తామనిమైనింగ్ ఏడితెలిపారు.ప్రభుత్వం నియమా,నిబంధనలు ప్రకారం మైనింగ్ శాఖ ద్వారా అన్ని అనుమతులు తీసుకోని ఇసుక, కంకర,మట్టి తరలించు కోవచ్చుఅని మైనింగ్ఏడీ తెలిపారు.ప్రభుత్వ ఆదాయానికి ఎవరైనాగండికొట్టే ప్రయత్నంచేసినకఠినంగా చర్యలుతీసు కుంటున్నారు. ప్రభుత్వ అధికారులకుఅందరూ సహకరించాలని ఆయన ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.కొత్తగా క్వారీ ఏర్పాటు చేసుకునేవారు. ఇసుక లభ్యతను బట్టి డి.ఎల్.ఎస్.సి సమావేశంలో చర్చించి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

రాజాపూర్,మార్చి 21 ప్రభాతవార్త : అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది గురువారం ఉదయం దాదాపు 11 గం.ల సమయంలో వారి ఇంటిలో తనిఖీ చేసి అక్రమంగా నిర్వహించిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కె. రవి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ ఫిర్యాదు మేరకు తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఎలాంటి పర్మిట్ అనుమతి లేకుండా అక్రమంగా దాదాపు 11 లీటర్ల 700 మి.లీ. మద్యం 2925 రూపాయల విలువ గల మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి అధిక రేట్లకు అమ్ముతున్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. రవి తెలిపారు.

నాగర్‌కర్నూల్ ఎంపి టికెట్‌ను సంపత్‌కుమార్‌కు ఇవ్వాలి

మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు భాస్కర్

ఇటిక్యాల,మార్చి 21 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకెపోగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో మాదిగలు 75 శాతం నాలుగు లక్షల మంది మాదిగలు ఉన్నారని ఒక్కలక్ష జనాభా లేని మాలల జనాభా లేదని వివరించారు. అలం పూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్నారని అలాగే పార్టీని నమ్ముకొని నిజాయితీగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసంపని చేశారని అలాంటి నాయకునికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుండి ఎంపి టికెట్ కాంగ్రెస్ హై కమాండ్ గుర్తించి ఇవ్వాలని లేదారాష్ట్ర పిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని లేని పక్షంలో కూడా ఎమ్మెల్సీగా అవకాశం వచ్చి మంత్రి పదవి ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్

ఇటిక్యాల,మార్చి 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండేరు పదవ బెటాలియన్ ఉన్నత పాఠశాలలో గురువారం కొనసాగిన తృతీయ భాష ఇంగ్లీష్ పరీక్షను రాష్ట్ర విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి 2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంఈఓ రాజు తెలిపారు. అదేవిధంగా ఇటిక్యాల, ఎర్రవల్లి పదవ బెటాలియన్ పరీక్షా కేంద్రాల నుండి ఒక్కొక్కరు చొప్పున పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మండలంలోని 4 పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా కొనసాగినట్లు ఎంఈఓ రాజు తెలిపారు.

ఘనంగా శ్రీఈదమ్మ మాందాత బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్‌లు

కల్వకుర్తిటౌన్,మార్చి 21 ప్రభాతవార్త: కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో గల శ్రీ ఈదమ్మ మాందాత అమ్మవారి బ్రహ్మోత్సవ, కళ్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్‌లు బృంగిఆనం

మిడ్జిల్‌కు మైన్స్ అధికారులు..

మొదటి పేజీ తరువాయి భాగం..

ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామ రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా మైన్స్ ఏడి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మైన్స్ సర్వేర్ సుజాత, మిడ్జిల్ ఆర్ఐ అంబిక, జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యలతో పాటు మరికొందరు అధికారులు ఇసుకను తీసుకువెళుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి తరలించకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించిన ఆధారాలను రైతులు, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు అధికారులకుచూపించారు. ప్రస్తుతం ఉన్నఇసుక నిల్వలను కొలతలు తీసుకుని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని మైన్స్ సర్వేయర్ సుజాత తెలిపారు. సర్వే నంబర్ 386/2 లో గల తన సొంత భూమిలో తనకు తెలియకుండా ఇసుకను దంపు చేశారని, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇసుకను ఖాళీ చేస్తున్నారని బాల్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. తన భూమి నుంచి ఇసుకను తరలించకుండా నిలిపివేయాలని బాల్‌రెడ్డి అధికారులను కోరారు.

పదేండ్లలో పాలమూరును పట్టించుకోలే..!

మొదటి పేజీ తరువాయి భాగం..

మాట్లాడి రూ.160కోట్ల నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు తీసుకునట్లుల తెలిపారు. వంశీ అన్నను గెలిపించి రాహుల్‌గాంధీకి గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గేట్లు తెరిచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అవినీతి పరులు, కబ్జాదారులకు ప్రవేశం లేదన్నారు.పార్టీ అభ్యున్నతికి నిజాయితీగా పని చేసే కార్యకర్తలకు ఆహ్వానం పలుతామన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

కనీస వసతులు కల్పించాలని వినతి

మక్తల్,మార్చి 21 ప్రభాతవార్త: నియోజకవర్గంలో ఉన్న గ్రంథాలయాల్లో కనీస వసతులు లేక గ్రంథాలయానికి పఠనం కోసం వస్తున్నటువంటి వ్యక్తులు చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు రిటైర్డ్ ఉద్యోగులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల అధికారులు నిత్యం గ్రంథాలయాల కోసం పోతుంటారు. గ్రంథాలయం విద్యార్థులకు దేవాలయంలా ఉపయోగపడుతుందని అన్నారు. అలాంటి గ్రంథాలయాల్లో మక్తల్ నియోజకవర్గాల్లో ఆ గ్రంథాలయాన్ని పట్టించుకునే నాథుడే లేడని పాఠకులు అంటున్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి వచ్చే నిధులు కూడా గ్రంథాలయాన్ని నిర్వహించే ఉద్యోగులకు జీతాలు కూడా గత ఆరు మాసాలుగా రావడం లేదని వారన్నారు. కనీసం నీటి వసతి లేదు రోజువారిగా వచ్చే దిన పత్రికలు సైతం గత పదిరోజుల ఉంచి రావడం లేదని పాఠకులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రంథాలయంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి పెట్టిఈ సమస్యను తీర్చాల్సిందిగా కోరుతున్నారు. కార్యక్రమంలో రుద్రస ముద్రం రామలింగం, పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి జి. నారాయణ,ఆర్‌టిఐ జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి,కిష్టప్ప, తిప్పన, అబ్దుల్ రషీద్, మైలుద్దిన్, నరసింహ, హీరోలాల్ విద్యార్థులు, ప్రైవేట్ ప్రభుత్వ విద్యార్థులు కోరుతున్నారు.

ఖిల్లాలో పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

ఖిల్లా ఘనపురం మార్చి21 ప్రభాతవార్త: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు పోలింగ్ కేంద్రాల నిర్ధారణ కొరకు రూటు వారిగా తిరుగుతూ పరిశీలించారు వెనక్కి తండా ముందరి తండా మామిడి మాడ సల్కెలాపురం అప్పారెడ్డిపల్లి మలికిమియాన్ పల్లి బుడగట్టు తాండ రోడ్డు మీద తండాలను పరిశీలిస్తూ ఆయా పోలింగ్ కేంద్రాలను డూప్లికేట్ ఓటర్లు ఏమైనా ఉన్నాయా అని బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. 85 సంవత్సరాలు దాటిన ఓటర్లతోపాటు దివ్యాంగులను ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలన్నారు.పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు మరుగుదొడ్లు విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్ల సౌకర్యం ఈ విధంగా చూసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న పాఠశాలలు అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. మామిడి మాడ వెనికి తాండ ముందరి తండాలలో విద్యార్థులతో మాట్లాడి వారిలోని విద్యా ప్రమాణాలను సామర్థ్యాలను పరిశీలించారు.ఈ వేసవి కాలంలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పాండు నాయక్ ఎంపీడీవో వెంకటాచారి కురుమూర్తి మిస్బావుద్దిన్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వెల్దండ, మార్చి 21 ప్రభాతవార్త: మండల కేంద్రంలో పశువైద్య ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్యులు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ పశుపోషక రైతులు పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. పశుపోషక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నరేష్‌రెడ్డి, రియాజ్, వెంకన్న, నర్సింహ్మ, ఫణీందర్, గోపాల్‌మిత్రలు మొగులయ్య, బాలు, విశాల్, విజయేందర్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

గురుకులం ఉద్యోగం సాధించిన యువతీకి సన్మానం

వెల్దండ, మార్చి 21 ప్రభాతవార్త: మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి అంభిక ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గురుకుల టీచర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అంభికను గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నారకట్ల రమేష్, గోరటి రవిలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంభిక భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికిఎదగాలన్నారు. అనంతరం తల్లిదండ్రులను అభినందించారు.

నారగడ్డ జాతరకు హాజరైన ఎమ్మెల్యే

మక్తల్,మార్చి 21 ప్రభాతవార్త: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ముస్లాయిపల్లి గ్రామంలో నారాగడ్డ జాతర సందర్భంగా ఎడ్లబండ్ల లాగుడు పోటీలను ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి ప్రారంభించారు. అనంతరం నారాగడ్డ శ్రీ చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిపి గడ్డంపల్లి హన్మంతు, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి తాయప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవిందు, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల అమలులో అధికారుల వైఫల్యం: ఏఐటియూసీ నాయకులు

ఆత్మకూర్ మార్చి 21 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులకు అమలు చేయాల్సిన కార్మిక చట్టాలలో లేబర్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటియూసీ అనుబంధ సంఘమైన తెలంగాణ బీడీ ఫెడరేషన్ సంఘం జిల్లా అధ్యక్షులు రాబర్ట్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బీడీ కార్మికులకు కనీస వేతనాల పెంపుదల కోసం యాజమాన్లు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికి అధికారులు ఏ మాత్రం చట్టాలు అమలు చేయడంలో కార్మికులకు కార్మిక సంఘాలకు సహకరించక పోవడం విచారకరమని ఆయనఆరోపించారు. వేతనాలు చెల్లిస్తామని గడిచిన రెండు సంవత్సరాల క్రితం ఒప్పందం చేసుకోగా యాజమాన్లు మాత్రం కేవలం 1000బీడీలకు 1080 రూపాయలు మాత్రమే చేల్లిస్తూ కార్మిక శ్రమ ఉన్న దోచుకుంటున్నప్పటికి అధికారులు మౌనం వహించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అందులో భాగంగానే ఈ నెల 22న బీడీ కార్మికులు వేతనాల పెంపుదల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో చిన్న చింతకుంట కార్యక్రమానికి కార్మికుల అధిక సంఖ్యలో హాజరై యాజమానులకు విజ్ఞాపన పత్రం అందజేసేందుకు తరలిరావలని ఆయన కోరారు ఇప్పటికైనా కార్మిక యాజమాన్లు బీడీ కార్మికులకు ప్రైవేటు పనులు అమలు విషయంలో కానీ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు తక్షణ సాయం కింద పదివేల రూపాయలు చెల్లింపులో గాని ఏ మాత్రం అమలు చేయకపోవడం బాధాకరమని అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు అందులో భాగంగా గడచిన రెండు రోజులుగా ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలలో బీడీ కార్మికులు కలిసి నేరుగా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందకు విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.

దోపిడీ రాజ్యం పోయింది

- ఇక బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు
- గత అవినీతిపై చట్టబద్ధంగా చర్యలు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్యకర్తలు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి21 ప్రభాతవార్త: అరాచకాలు, ఆక్రమణలు, దోపిడిరాజ్యం పోయి, ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో జీవించే అవకాశం ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ కల్పించిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 12,26, 33, 45 వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ మునీర్, కౌన్సిలర్ చిన్న,కౌన్సిలర్ ఉమర్‌తో పాటు 200ల మంది నాయకులు, కార్యకర్తలు మహబూబ్‌నగర్ ఎమ్మెలేన శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత అరెస్టుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి అర్థం అయిందని, రాష్ట్రంలో కెసిఆర్‌తో పాటు ఓ డజన్ మంది, ఇక్కడ మాజీ మంత్రితో ఓ అరడజన్ మంది ఉంటారని తెలంగాణ గడ్డపై ఇంక బిఆర్ఎస్ ఉండదని,గత ప్రభుత్వంలో పని చేసిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసినటువంటి అరాచకాలు, అవినీతిపై చట్టబద్ధంగా చర్యలు ఉంటాయని తప్పకుండా వారు జైలుకు వెళ్ళడం తథ్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కూడా చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ, ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా దండుకోవడం దాచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి ఏమి లేదని అభివృద్ధి మాటున అరాచకాలు, ప్రశ్నించిన వారిపై కేసులు తప్ప బిఆర్ఎస్ నాయకులు చేసిందేమి లేదని ఆయన స్పష్టం చేశారు. గత పది సంవత్సరాల సమయంలో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిన ఘన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన ఉంటుందని, పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ అని, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రతిక్షణం పని చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిలో అద్భుతమైన రీతిలో ముందుకు దూసుకుపోతున్నదని, అందులో భాగంగానే, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు నెలలు నిండకుండానే 3000 కోట్లతో అగ్రికల్చర్,వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలతో పాటు నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనిపాలమూరు విశ్వవిద్యాలయంలో లా కళాశాలతో పాటు, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం ఎఐసిటి అనుమతుల కోసం మౌలికమైన ఆదేశం ఇవ్వడం జరిగిందని, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అనుమతి ఇచ్చారని, మున్సిపల్ పరిధిలోని ప్రతివార్డులో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాలకు 40 కోట్ల రూపాయలు అనుమతులు హైదరాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ పనులు ప్రారంభం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, ఒక్క కళాశాల కూడా ఏర్పాటుకాలేదని, ఒక్క పరిశ్రమ కూడా ప్రారంభించేది లేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే విధంగా ప్రతిక్షణం పని చేస్తామని, ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను తెలంగాణ రాష్ట్రంలోనే కాదు భారతదేశంలోనే అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారనీ, వారికి బాసటగా మనం నిలిచి వారు ఇంఛార్జిగా కొనసాగుతున్న మహబూబ్‌నగర్ ఎంపి సీటు అత్యధిక మెజార్టీతో గెలిపించి రేవంత్‌రెడ్డికి బహుమతి ఇవ్వాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు మధ్య పోటీ ఉంటుందని, బిఆర్ఎస్ పార్టీ అసలు ఏమాత్రం పోటీ ఇవ్వదని భారీ మెజార్టీతో పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలవబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే తథ్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, కౌన్సిలర్ మునీర్, కౌన్సిలర్ తిరుమల వెంకటేష్, మోతినగర్ కౌన్సిలర్ పాషా, కౌన్సిలర్ గిరి, చిన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జి సిజె బెనహర్, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బెక్కరి అనిత, జిల్లా మైనార్టీ సెల్ ఛైర్మన్ ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, అన్వర్, మాజీ కౌన్సిలర్ బి.శివశంకర్, తఖి, రమేష్, మహ్మద్ సాదిక్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకులు పార్టీ మార్పుపై మాట్లాడే హక్కు లేదు

మొదటి పేజీ తరువాయి భాగం..

మాట్లాడారు.మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వేరే పార్టీ నుండి వచ్చా డని గుర్తు చేసుకోవాలని సూచించారు.దేశం కోసం మోదీ పాల మూరు కోసం అరుణమ్మ వచ్చిందని చెప్పారు.మోదీ బంటుగా అరుణమ్మ మీ ముందుకొచ్చింది. ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తాను అని అన్నారు.గట్టిగా మాట్లాడితే లీడర్‌లు అయిపోతారా.మోదీ మా పెద్దన్న అని మాట్లాడిన రేవంత్ ఆ మరుసటి రోజే మాట మార్చడం సిగ్గుచేటని అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదని జోస్యం చెప్పారు.కర్ణాటకలో 24 పార్లమెంట్ స్థానాలు,ఇక్కడ12 స్థానాలు గెలుస్తాం అన్నారు.ఆరు గ్యారంటీల పేరుతో అప్పుడు మోసం చేశారు.ఇప్పుడు రాహుల్ ప్రధాని అని మోసం చేశారు.ఇప్పుడు రాహుల్ ప్రధాని అని మోసం చేయాలని చూస్తున్నారు. దేశ ప్రజలు గుర్తించాలని సూచించారు. ఇప్పుడున్న అభ్యర్థులు పాలమూరుకు ముఖ పరిచయం లేనోళ్లే...ఇక కాంగ్రెస్ అభ్యర్థికి ఈ ప్రాంతం వాడు కానేకాదని అన్నారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తెచ్చిందే అరుణమ్మఅని,మక్తల్, నారాయణపేట్ జడ్చర్ల,షాద్నగర్,వంటి ప్రాంతాలకు నీళ్లు ఇచ్చేందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది నేనేనని చెప్పారు. బిఆర్ఎస్‌స్వార్థపూరిత రాజకీయాలతో ప్రాజెక్ట్ డీపిఆర్‌మార్చారని అన్నారు.ఓట్ల కోసం దొంగ ఏడుపులు ఏడ్చేటోళ్ళు..అనాడు విభజన చట్టంలో పాలమూరుకు జాతీయ హోదా అంశం ఎందుకుపెట్టలేదని మండిపడ్డారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఈజిల్లా అభివృద్ధి కోసం నేను ఎంతో కృషి చేశానని చెప్పారు. మహబూబ్‌నగర్ కు ప్రజలు సేవాకురాలిగా అన్ని రకాల అభివృద్ధిలో నాపాత్ర ఉందని కొత్తకోట నుంచి మంత్రాల యం రోడ్డు ప్రతిపాదనలు తెచ్చిందే నేనని తెలిపారు. పాలమూరులో కూడా బిజెపికే ప్రజలుపట్టం కట్టబోతున్నారని ఈ దేశానికి మోదీ మరో సారి ప్రధాని కావాలని ప్రతివర్గం వారు అనుకుం టున్నారని చెప్పారు.ఇప్పుడు వేయబోయే ఓటుపెద్ద ఓటు.మోదీకే వేయాలని ప్రజలు నిర్ణయిం చుకున్నారని.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలన అవినీతి,అరాచకమే అని పేర్కొన్నారు.అలాంటిపాలన నుంచి మార్పుకావాలని ప్రజలు కోరుకున్నారు.గుడ్డిలోమెల్లలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నా రు.గత ప్రభుత్వం బిఆర్ఎస్ తీరును ఎండగట్టిందే బీజేపీనే అని అన్నారు.అయితే అబద్దపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకివచ్చిందని మహిళకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం అంటూ గగ్గోలు పెట్టడం తప్ప..కాంగ్రెస్ఏఒక్క హామీఅమలు చేయాలేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక100 రోజుల్లో ఆరుగ్యారంటీలు అమలు చేస్తాం అన్నారు. ఇప్పుడుఎలక్షన్ కోడ్‌పేరుతో నాటకాలు ఆడుతున్నారని తెలిపారు. ముందుగా కొత్తకోట అమడబాకుల గ్రామాల నుండి యువకులు బీజేపీ పార్టీలోకి చేరారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు కొటేశ్వర్ రెడ్డి,భరత్ భూషణ్,వెంకట్‌రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

- ఈనెల 23,26 తేదీల్లో సిబ్బందికి శిక్షణ
- 27న కేంద్రాలకు సామగ్రి తరలింపు, 28న పోలింగ్
- సమీక్ష నిర్వహించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 21, ప్రభాతవార్తః ఈనెల 28న జరుగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నక పారదర్శంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి రవినాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగ్ స్థానిక సంస్థల నియోకవర్గ శాసనమండలి ఉప ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్. నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల,వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల ఏఆర్‌వోలు, ఉప ఎన్నిక నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతోవెబెల్స్ సమావేశం నిర్వహిం పోలింగ్, కౌంటింగ్, ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌వోలు నోడల్ అధికారులు సమన్వయంతో పని చేసి భారత ఎన్నికల ఆదేశాను అనుసరించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఉప ఎన్నిక నిర్వహణకు పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్, పీవో, ఏపీవో ఇతర పోలింగ్ సిబ్బంది నియమించి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా పీవో, ఏపీవో ఇతర పోలింగ్ సిబ్బదికి ఈనెల 23,26న మొదటి, రెండో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లో ప్రాధాన్యత ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా జరుగుతుందని, శిక్షణలో వివరించాలన్నారు. ఉప ఎన్నకకు 10పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల27ప పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. పట్టిష్ట బందోబస్తు మధ్య ఎస్కార్టతో పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేయడం జరగుతుందన్నారు. పోలింగ్ వెబ్ క్యాస్టింగ్ వీడియోగ్రఫీ నిర్వహించడం జరగుతుందని, అదేవిధంగా సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. రవాణసిద్ధం చేసుకోవాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీ అమలు చేయాలన్నారు. ఏఈఆర్‌వోలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్నిఏర్పాట్లనుచూసుకోవాలన్నారు. జెడ్పీ సీఈవో,మున్సిపల్ కమిషనర్లు ఓటర్లకు ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

నీళ్లు లేక రైతుల పంటలు ఎండుతున్నాయి

పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

కొత్తకోట మార్చి 21 ప్రభాతవార్త: నీళ్లు లేక రైతుల పంటలు ఎండుతున్నాయని పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండు చేశారు. గురువారం మదనపురం మండలంలోని దంతనూర్ గ్రామంలో రైతులు గట్టన్న, చెన్నయ్య ఎండిన వరి పంటలను స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 2014 కంటే ముందున్న పరిస్థితులు పాలమూరు జిల్లాలో కనిపిస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెసోళ్ల చెప్పిన మార్పు ఇదేనే మోరైతులను ముంచడానికే ప్రభుత్వం వచ్చిందని ఎద్దేవాచేశారు. ఈ సందర్భంగా మేము రైతుల పక్షాన కరెంటు లేక, సాగునీరు లేక పెట్టుబడి పెట్టి వెల రూపాయలు నష్టపోయిన రైతులకు వెంటనే ఎకరాకు 10000 రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. అసమర్థ పాలన వల్ల గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడిందని ఎంతసేపు గత ప్రభుత్వం కేసీఆర్ చేసిన అభివృద్ధిని విమర్శించడం తప్ప అవకాశం వచ్చింది. కేసీఆర్ కంటే గొప్పగా పాలన అందించాలనే సోయి కూడా ఈప్రభుత్వానికి లేదని అన్నారు. అమలుగాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు.రైతు భరోసా 15 వేలు ఇస్తామన్నారు.ఇప్పటివరకు రైతు బంధు 10 వేలు కూడా జమ చెయ్యలేదు, పించన్లు 4000 ఇస్తామన్నారు. ఇవ్వడం లేదని విమర్శించారు. 2 లక్షలు రుణమాఫీ ఇప్పటివరకు దాని ఊసే లేదని కాంగ్రెస్ పార్టీ 420 హామీలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు సాగు చేస్తే పంటలు కరెంటు, నీళ్లు, లేక ఎండిపోయాయని, ఇప్పటివరకు రైతులకు రైతుబంధు డబ్బులు రాలేదని, దంతనూర్‌లో కౌలు రైతు చెన్నయ్య,గట్టన్న, సాగుచేసిన వరి పంట ఎండిపోయి మేకలను మేపుతున్నాడని ప్రభుత్వం తగు నష్టపరిహారం ఇచ్చి రైతును ఆదుకోవాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా పరిపాలన పై దృష్టి సారించి రైతుల పక్షాన నిలబడి రైతులను ఆదుకోవాలని తెలిపారు. రానున్న ఎమ్మెల్సీ పార్లమెంటు ఎన్నికల్లో కారుగుర్తు కు ఓటు వేయాలని కోరారు. రైతు గట్టన్న మాట్లాడుతూ కరెంటు, నీళ్లు లేక సాగుచేసిన 2 ఎకరాలలో ఎకరన్నర పంటపూర్తిగా ఎండిపోయినందున పంటను మేకలను వదిలేశానని, కౌలు డబ్బులు పెట్టుబడి దాదాపుగా 50 వేల రూపాయలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాలమనెమ్మ, కొన్నూర్ జయంతి, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, గాడిల ప్రశాంత్, శ్రావణ్ కుమార్‌రెడ్డి, తిరుపతి, ఆవుల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పోలింగ్